క్లుప్తంగా

గ్రంథాలయం పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న బానోతు బాలమ్మ

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఆ గ్రామ యువకులు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ సందర్శించారు. గ్రంథాలయ నిర్వహణ తీరును గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు, గ్రంథాలను పరిశీలించారు. గ్రామంలోని యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయాన్ని నిర్వహించడాన్ని ఆమె అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

చండూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు సేవ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలోని గగన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 200 మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, సెక్రటరీ నెల్లూరి శ్రీనివాసులు, కోశాధికారి సంగు జానయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు, హాస్పిటల్ నిర్వాహకులు పొన్నెబోయిన రాజు, నీలకంఠం స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు అందజేత



బెంచీలు అందజేస్తున్న దాతలు

నకిరేకల్ : పట్టణంలోని 6వ వార్డు చీమలగడ్డ వీధుల్లో ఏర్పాటు చేసేందుకు సిమెంట్ బెంచీలను సుభాష్ యూత్ ఆధ్వర్యంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా అందజేశారు. ఆయన వెంట బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య ఉన్నారు.

నాంపల్లి సీఐగా నవీన్‌కుమార్



మర్రిగూడ : నాంపల్లి సర్కిల్ సీఐగా మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో అనంతు నవీన్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చండూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసి సీఐగా పదోన్నతి పొందారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన సీఐ విఠల్ రెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొందడంతో డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌కు మర్రిగూడ ఎస్ఐ కె.రంగారెడ్డి, కానిస్టేబుళ్లు యాదయ్య, రమేష్, సైదులు, వహీద్‌లు స్వాగతం పలికారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

నల్లగొండ టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ ఐకాన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా గోపగాని యాదగిరి, కార్యదర్శిగా రొక్కం నీలం రెడ్డి, కోశాధికారిగా బండారు శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు, ఉప గవర్నర్ ఏరాల ప్రభాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ నేతి రఘుపతి, డాక్టర్ అన్సారి, సతీష్ కుమార్, జిల్లా దశరథ, మండడి నర్సిరెడ్డి, చిలుకూరి రామకృష్ణ, మురళీధర్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, గట్టుపల్లి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదోరోజుకు చేరిన రైతుల రిలే దీక్ష

మర్రిగూడ : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలులో తరుగు పేరుతో అధిక కోతలు విధించారని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. దీక్షలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైతులు

దళిత బంధుతో స్వయం ఉపాధి

- ఎల్లమ్మగూడెం గ్రామంలో 28 దళిత బంధు యూనిట్ల మంజూరు
- సొంతంగా వ్యాపారం చేసుకుంటున్న దళిత కుటుంబాలు

రామగిరి(నల్లగొండ): దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా దళితుల్లో ఆర్థిక సాధికారత, స్వావలంబన సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. దళిత బంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. సీఎం కేసీఆర్ 2021 ఆగస్టు నెలలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో లాంఛనంగా దళితబంధు పథకాన్ని ప్రారంభించారు. దశల వారీగా రాష్ట్రంలో ఈ పథకం అమలవుతోంది.

ఎల్లమ్మగూడెంలో 28 యూనిట్ల మంజూరు

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామాన్ని దళితబంధు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ గ్రామంలో మొత్తం 28 కుటుంబాలకు దళిత బంధు యూనిట్లు మంజూరయ్యాయి. అందులో 11 యూనిట్లు ట్రాక్టర్లు, 5 పౌల్ట్రీఫామ్‌లు కాగా మిగతావి సెంట్రింగ్ యూనిట్, టెంట్ హౌజ్, ఆన్‌లైన్ సెంటర్, మినీ సూపర్ బజార్, పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రం, కార్లు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నెలలో యూనిట్ల పంపిణీ ప్రారంభం కాగా 2023 ఏప్రిల్ నెలలో పథకం అమలు పూర్తయింది. వివిధ ప్రదేశాల్లో పనిచేసుకుంటూ జీవిస్తున్న దళితులకు ఈ పథకం ఎంతో ప్రయోజకరంగా మారింది. దళిత బంధు పథకం వల్ల దళితులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. దళిత బంధు పథకం తమ జీవితాల్లో వెలుగులు నింపిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దళిత బంధు పథకం ద్వారా లబ్ధిదారులు ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫాం



దళిత బంధు పథకం ద్వారా లబ్ధిదారులు ఏర్పాటు చేసిన టెంట్ హౌజ్

పెట్రోల్ బంకులో పని చేశా



సూర్యాపేటలోని ఓ పెట్రోల్ బంకులో 6 సంవత్సరాలు పని చేశా. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ద్వారా నేడు స్వయం ఉపాధి పొందుతున్నా. దళిత బంధు పథకం కింద వచ్చిన డబ్బులతో సూర్యాపేటలో టెంట్ హౌజ్ పెట్టాను. షాపు ద్వారా మా కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

–మల్లేపల్లి వెంకటయ్య, ఎల్లమ్మగూడెం

పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేశాం



దళిత బంధు పథకం ద్వారా ఉపాధి లభిస్తోంది. నాతోపాటు మా తమ్ముడి కుటుంబ సభ్యులందరం కలిసి పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేశాం. అందరం కలిసి పౌల్ట్రీ పనులు చేసుకుంటున్నాం. మొత్తం 7500 కోడి పిల్లలు పెంచగా ఇటీవల మొదటిసారి విక్రయించినప్పుడు రూ.లక్షా యాభై వేల లాభం వచ్చింది. మళ్లీ రెండోసారి కోడి పిల్లలను వేశాం.

–ఆదిమళ్ల సతీష్ కుమార్, పౌల్ట్రీఫామ్, ఎల్లమ్మగూడెం

ఆర్థిక భరోసా ఏర్పడింది



దళితుల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. దళితబంధు పథకం ద్వారా ఎల్లమ్మగూడెంలో 28 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఉపాధి లేని వారు నేడు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరి ఆర్థికంగా బలోపేతం అయ్యారు. తద్వారా దళితుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా ఏర్పడింది.

–ఊట్కూరు సందీప్‌రెడ్డి, గోదోరిగూడెం ఎంపీటీసీ

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

చండూరు : మునుగోడు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చండూరు మండలంలోని కస్తాల గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు కట్ట రమేష్‌తోపాటు మరికొంత మంది బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కట్ట నరసింహ, గంట సాత్విక్, కట్ట గణేశ్, బొమ్మరబోయిన పృథ్వి, జిల్లా చంటి, కట్ట సురేష్, కట్ట రమేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ గుండమల్ల శ్రీనివాసులు, సర్పంచ్ మెండు ద్రౌపదమ్మ వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ ఊరుగుండ్ల వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యుడు మెండు బ్రహ్మానంద రెడ్డి, ఆకారపు రవి, జాల వెంకటేశం, జిల్లా ధనరాజ్, కట్ట సైదులు, జహంగీర్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేక ప్రజల అవస్థలు



ఇన్‌చార్జ్ ఆర్ఐ చుట్టూ గుమికూడిన ప్రజలు

మునుగోడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే వివిధ రకాల సంక్షేమ పథకాలకు ఆర్ఐ నివేదిక తప్పనిసరి. మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రస్తుతం ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండడంతో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్ రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులు, కలెక్టర్ కార్యాలయానికి పంపే నివేదికలు సిద్ధం చేయడంతోపాటు ఫీల్డ్ వర్క్ కూడా ఒక్కడే చేస్తుండడంతో భారంగా మారింది. 26 గ్రామ పంచాయతీలు ఉన్న మండలానికి ఇద్దరు ఆర్ఐలు ఉండగా ఒకరిని డిప్యూటేషన్‌పై భూసేకరణ విభాగానికి కేటాయించారు. మరొక ఆర్ఐ 25 రోజుల క్రితం పదోన్నతిపై వెళ్లింది. అప్పటి నుంచి కల్యాలక్ష్మి, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతోపాటు భూ విలువ, మరణ, జనన ధృవీకరణ పత్రాలు మండలంలోని ప్రజలకు సకాలంలో అందడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆర్ఐ పోస్టును వెంటనే భర్తీచేయాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డెక్కిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

మునుగోడు : నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతోపాటు పట్టణ అధ్యక్షుల నియామకం విషయంలో సీనియర్ కార్యకర్తలకు న్యాయం జరగలేదని నాలుగైదు రోజులుగా కాంగ్రెస్ పార్టీలో తగవులు జరుగుతున్న విషయం విదితమే. చలమల్ల కృష్ణారెడ్డిపై ఓ వర్గం నాయకులు ఆరోపణలు చేస్తుండగా.. పాల్వాయి స్రవంతి రెడ్డి, పున్న కైలాస్ నేతపై మరో వర్గం కార్యకర్తలు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటివరకు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణలు చేసుకున్న కార్యకర్తలు ఆదివారం ఏకంగా రోడ్డుపైకి వచ్చారు. కైలాస్ వర్గీయులు కొందరు మునుగోడులో చలమల్ల కృష్ణారెడ్డి ఫ్లెక్సీతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద దహనం చేసేందుకు ప్రయత్నించగా, గమనించిన చలమల్ల వర్గీయులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగి తోపులాట వరకు వచ్చారు. ఈ విషయం తెలిసిన ఎస్ఐ వెంకటేశ్వర్లు వెంటనే తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని తగవు పడుతున్న కార్యకర్తలను చెదరగొట్టారు.



వాగ్వాదం చేసుకుంటున్న చలమల్ల కృష్ణారెడ్డి, పున్న కైలాస్ నేత వర్గీయులు

కనులపండువగా కాళికామాత బోనాలు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో వెలిసిన శ్రీ స్వయంభూ కాళికామాత ఆలయంలో ఆదివారం ఆషాడ మాసం బోనాల వేడుకలు కనులపండువగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి కాళికామాత అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, పూజర్ల శంభయ్య, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, కాంగ్రెస్ నేత దైద రవీందర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్యలు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు గాజుల సుకన్య, సునీత రవీందర్, ఆలయ అధ్యక్షుడు యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, గౌరవాధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్ ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం



దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



బోనాలతో వెళ్తున్న మహిళలు

గురుకులంలో మౌలిక వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి చిన్నపురి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేశారు. నకిరేకల్ మండలం చందుపట్లకు చెందిన బీసీ బాలికల పాఠశాల నల్లగొండ నుంచి కట్టంగూర్ మండలం చిన్నపురి గ్రామంలో గల పోప్‌పాల్ పాఠశాల భవనంలోకి ఈ విద్యాసంవత్సరం మార్చారు. భవనంలో సరిపడా గదులు, పాఠశాల చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. రాత్రి పూట విషసర్పాలతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. డైనింగ్ హాల్ లేక ఎండలో నిల్చుని తినే పరిస్థితి నెలకొందన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

చండూరు : నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జక్కలి ఐలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం చండూరులో టీడీపీ సమావేశంలో ఆయ న మాట్లాడారు. టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతి నిధి ఎండీ షరీఫ్, మండల కన్వీనర్ ఎర్రజల్ల లింగయ్య, అంజయ్య, భిక్షం, యాదయ్య, అనంతరాములు, నరసింహ, ముత్తయ్య, పాపయ్య పాల్గొన్నారు.

రేగట్టె దినేష్‌రెడ్డికి ఘన నివాళి

నార్కట్‌పల్లి : జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి కుమారుడు రేగట్టె దినేష్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, నల్లబోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌లు పాల్గొని దినేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందరెడ్డి, సర్పంచ్ మల్గ బాలకృష్ణ, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, మాజీ సర్పంచ్ పుల్లెంల అచ్చాలు, ఉప సర్పంచ్ దోనాల శంకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గోదాల వెంకట్‌రెడ్డి, అల్లుబెల్లి సత్తిరెడ్డి, జ్ఞానేశ్వర్‌చారి, శివ, దాసోజు కోటి, బండమీది లింగస్వామి, శంకర్ ఉన్నారు.



దినేష్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్యగౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ సత్యనారాయణ, వినోద్‌కుమార్, రాములు, ఎల్లేష్, యాదయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేది లేదు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బెదిరింపులకు భయపడేది లేదని సీఐటీయు మండల కన్వీనర్ భీమగాని గణేశ్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ ఆదివారం తిప్పర్తి సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాతీయ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమగాని గణేశ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షకార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, మైనం మల్లయ్య, శ్రీనివాసాచారి, పీరయ్య, మైసయ్య, భిక్షం, పరమేష్, జానమ్మ, మరియమ్మ, అంజమ్మ, కాసాని సైదులు, కల్పన, సైదులు, శాంతాబాబు, శివ, రాజు, లాలు, పర్శరాములు, వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చిట్యాల : గ్రామ పంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆదివారం ఆయన పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వావిళ్ళ మహేష్, జిల్లా కమిటీ సభ్యురాలు మహంకాళి బాలమ్మ, సిరిపంగి యాదయ్య, మర్రి సులోచన, మారెమ్మ, నర్సమ్మ, కృష్ణమ్మ, నాగమణి, లక్ష్మయ్య, యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కు బుద్ధి చెబుతాం

చండూరు : నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ అన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాలుగో రోజు సమ్మెలో భాగంగా కార్మికులు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికులను తొలగిస్తామని ఎమ్మెల్యే బెదిరించడం అవివేకమన్నారు. జెర్రి పోతుల ధనంజయ్య, కత్తుల సైదులు, ఏర్పుల సైదులు, నాంపల్లి శంకర్, జానయ్య, చంద్రయ్య, మల్లయ్య, శ్రీను, సతీష్, భిక్షం, అంజమ్మ, లక్ష్మమ్మ, లింగమ్మ, కొండల్ తదితరులు ఉన్నారు.

నాలుగో రోజుకు చేరిన సమ్మె

మర్రిగూడ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 4వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో కోటిపల్లి హనుమంతు, ఊరిపక్క లింగయ్య, పెరుమాండ్ల మంజుల, పోలెపల్లి రాములు, ఒంపు ముత్తమ్మ, వెంకటయ్య, ఎడ్ల రమణమ్మ, సునీత, యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు



చండూరు : రాస్తారోకో చేస్తున్న కార్మికులు



చిట్యాల : నినాదాలు చేస్తున్న కార్మికులు



మర్రిగూడ : సమ్మె చేస్తున్న కార్మికులు

గీతకార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్.. కల్లు గీతకార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లెంకలపల్లి గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మిక సొసైటీలోని సభ్యులందరికీ మోటార్ సైకిళ్లు, సేఫ్టీ మోకు అందించాలని, జీఓ నెం. 560 ప్రకారం ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ధనుంజయ్‌గౌడ్

ఆర్యవైశ్య బంధు ఏర్పాటు చేయాలి

చిట్యాల : ఆర్యవైశ్య కులంలోని పేదలను ఆదుకునేందుకు ఆర్యవైశ్య బంధు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. చిట్యాలలో ఆదివారం ఆర్యవైశ్య కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేలుపల్లి మదన్‌మోహన్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వరికల్ గోపాల్, చిట్టిమళ్ళ శ్రవణ్‌కుమార్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, రామిని అంజయ్య గుప్తా, మేడిశెట్టి అంజయ్య గుప్తా, జయారపు బుచ్చయ్య గుప్తా, వాసా రమేష్ గుప్తా, బిజ్జాల సోమయ్య గుప్తా, బాదం మేఘనాథం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 80వ రోజు ఆదివారం కొనసాగింది. దీక్షలో ఆ గ్రామ ఉప సర్పంచ్ ఆకుల అనిల్‌తోపాటు వార్డు సభ్యులు, అఖిలపక్ష పార్టీల నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ అనుమతులు నిలిపివేసే వరకు దీక్ష చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో బొంగురాల యాదయ్య, జనార్దన్, పాండుగుల జనార్దన్, బండమీది వెంకన్న, పోలగోని సైదులు, కొరిమి సైదులు, పాపయ్య, కొత్వాల నాగరాజు, ఆదిరాల చిన్న పుల్లరావు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ ఎన్నిక జరిగేనా !

మునుగోడు : మండలంలోని కొంపల్లి ఎంపీటీసీ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ ఎంపీటీసీ స్థానానికి నేటికీ ఎన్నిక నిర్వహించలేదు. సాధారణంగా ఎంపీటీసీ, సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు ఖాళీ అయితే ఆరు నెలలలోపు ఎన్నిక నిర్వహించాలి. కానీ కొంపల్లి ఎంపీటీసీ స్థానం ఖాళీ అయ్యి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా ఎన్నిక నిర్వహించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కొంపల్లి ఎంపీటీసీ స్థానానికి ఎన్నిక నిర్వహించాలని ఓటర్లు కోరుతున్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా కలిసి పనిచేస్తాం

చండూరు : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ ఎవరికిచ్చినా కలిసి పనిచేస్తామని పాల్వాయి స్రవంతి వర్గీయుడు కాంగ్రెస్ నాయకుడు మంచుకొండ సంజయ్ అన్నారు. ఆదివారం ఆయన చండూరులో విలేకరులతో మాట్లాడారు. నిజమైన కాంగ్రెస్ వాదులను అవమానపరిస్తే సహించేది లేదన్నారు. పాల్వాయి స్రవంతిని విమర్శించే స్థాయి చలమల్ల వర్గీయులకు లేదన్నారు. పాల్వాయి కుటుంబం అవినీతి. అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే పదవులు ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రమంలో పన్నాల లింగయ్య మాదవ్, నెర్లకంటి రవి, సాగర్‌రెడ్డి, కట్ట అంజయ్య, శ్యాం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు